
సాక్షి
ఖమ్మం
బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



పూడిక.. తీయక..

చర్ల మండలంలో 1976లో నిర్మించిన తాలిపేరు ప్రాజెక్టు నిర్వహణపై నిర్లక్ష్యం కనబర్చడంతో భారీగా పూడిక పేరుకుపోయింది. 8లో



రూ.2కోట్లకు టోకరా

ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి నకిలీ ఆర్డర్లు ఇస్తూ రూ.2కోట్ల మేర స్వాహా చేసిన ఓ జంట మోసం బయటపడింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
36° / 21°

జిల్లాలో బుధవారం మధ్యాహ్న ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం నుంచే ఎండ మొదలై గంటగంటకు పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ప్రతీ వసతిగృహంలో కంప్యూటర్



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న డీడీ సత్యనారాయణ, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని అన్ని ఎస్సీ సంక్షేమ వసతిగృహాలకు కంప్యూటర్ సమకూరుస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఖమ్మంలోని ఎస్సీ బాలుర 'బీ' వసతిగృహంలో ఏర్పాటుచేసిన కంప్యూటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించిమాట్లాడారు. హాస్టళ్ల అవసరాలతోపాటు విద్యార్థులకు శిక్షణ కోసం కంప్యూటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నగరంలోని పలు హాస్టళ్లకు కంప్యూటర్లు అందజేయగా, గ్రామీణ ప్రాంత హాస్టల్లకు త్వరలోనే అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ అజయ్‌కుమార్, ఎస్‌బీఐ మేనేజర్ రవీందర్, సంక్షేమాధికారులు కోటపాటి రుక్మారావు, ఎస్.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల బారిన పడకండి

ఖమ్మంక్రైం: నానాటికీ ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. సైబర్ మోసగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుకూలంగా మార్చుకుని అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారని తెలిపారు. ఈఏడాది ఇప్పటికే 292 ఫిర్యాదులు అందగా, రూ.1.40 కోట్ల వరకు బాధితులు మోసపోయారని పేర్కొన్నారు. అయితే, సకాలంలో ఫిర్యాదులు అందిన కేసుల్లో రూ.25 లక్షల మేర నేరగాళ్ల ఖాతాల్లో జమ కాకుండా ఆపడంతో పాటు రూ.6 లక్షలు బాధితులకు ఇప్పించినట్లు తెలిపారు. కాగా, ప్రజలు ఇలాంటి మోసాలపై అవగాహన పెంపొందించుకుని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లు, మెసేజ్‌లకు స్పందించవద్దని సీపీ సూచించారు. ఒకవేళ ఎవరైనా మోసపోతే సైబర్‌క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సత్వరమే స్పందిస్తే తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యాన పనిచేసే ఈ కాల్‌సెంటర్‌లోని సాఫ్ట్‌వేర్‌కు బ్యాంకుల రిస్క్ మేనేజ్‌మెంట్ టీమ్‌లు అనుసంధానమై ఉంటాయని తెలిపారు. తద్వారా ఉద్యోగులు అప్రమత్తమై ఖాతాలను ఫ్రీజ్ చేస్తారని వెల్లడించారు. ఇక ప్రజలు మోసాల బారిన పడకుండా సైబర్ క్రైమ్ పోలీసుల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని సీపీ తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని ఎన్‌హెచ్‌ఎం విభాగాల్లో తాత్కాలిక, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై 56మందిని నియమించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుబ్బారావు తెలిపారు. వైద్యాధికారి పోస్టుకు ఎంబీబీఎస్ పూర్తిచేసి తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు అర్హులని పేర్కొన్నారు. మిగతా కేటగిరీలకు అర్హతలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు http://khammam.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు వెంట సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, ఫొటో జత చేసి మార్చి 3వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా తమ కార్యాలయంలో అందజేయాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

నేడు కేఎంసీ బడ్జెట్ భేటీ

- ఆదాయం అంచనా రూ.80.67 కోట్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ) బడ్జెట్ సమావేశం బుధవారం జరగనుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ఈసమావేశంలో ఆమోదించనున్నారు. కేఎంసీకి రూ.80.67 కోట్ల ఆదాయం వస్తుందనే అంచనాలతో ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఇందులో ఇంటి పన్నుల ద్వారా రూ.30.40 కోట్లు, స్టాంప్ డ్యూటీ ద్వారా రూ.27 లక్షలు, ఇతర వనరుల ద్వారా రూ.50 కోట్లు వస్తాయని అంచనాల్లో పొందుపర్చారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.14.47 కోట్లను మిగులుగా చూపిస్తుండగా, ప్రభుత్వం నుంచి సుమారు రూ.100 కోట్ల నిధులు వివిధ రూపాల్లో వస్తాయని అంచనాల్లో పేర్కొన్నారు.

రైలు టికెట్ చార్జీల తగ్గింపు

ఖమ్మం మామిళ్లగూడెం: రైలు ప్రయాణికులకు ఊరటనిచ్చేలా చార్జీలు తగ్గించారు. కరోనా సమయాన రద్దు చేసిన పలు రైళ్లను ఆ తర్వాత పునరుద్ధరించినా ప్రత్యేక రైళ్లుగా నడిపించి చార్జీలు పెంచారు. ఇప్పుడు పుష్‌పుల్, ప్యాసింజర్ రైళ్లలో చార్జీలు తగ్గించగా, బుధవారం నుంచి అమలవుతాయని సీసీఐ జాఫర్ తెలిపారు.

ఈ వేసవిలో ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు తాగునీటి సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలకు నీరు సరఫరా చేసే పాలేరు జలాశయంలో నిల్వలు అడుగంటుతున్నాయి. కొద్దిరోజులైతే సరఫరా చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికిప్పుడు సమస్య లేకున్నా.. నడివేసవిలో మాత్రం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి సరఫరా కాని పక్షంలో ఇబ్బందులు తప్పేలా లేవు. ఈ ఏడాది జూలై వరకు మూడు జిల్లాలకు 3.50 టీఎంసీల నీరు అవసరం ఉండగా.. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.125 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

ముందుంది ముప్పు

అడుగంటుతున్న పాలేరు జలాశయం

- రానున్న వేసవిలో తాగునీటి సరఫరాపై ఆందోళన
- ఇక్కడి నుంచే మూడు జిల్లాలకు సరఫరా
- రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.125 టీఎంసీలు మాత్రమే..
- కేఆర్‌ఎంబీ స్పందిస్తేనే సాగర్ నుంచి జలాలు
- మరోవైపు పంటలకు వదలాలంటూ రైతుల ఆందోళన



అడుగంటిన పాలేరు జలాశయం

రోజుకు 135.45 క్యూసెక్కులు..

ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని 2,439 గ్రామాలకు పాలేరు జలాశయం నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. ఖమ్మం జిల్లాలో 276 గ్రామాలు, మహబూబాబాద్ జిల్లాలో 1,769, సూర్యాపేట జిల్లాలోని 394 గ్రామాలకు ఇక్కడి నీరే ఆధారం. ఈ రిజర్వాయర్ నుంచి రోజుకు 135.45 క్యూసెక్కుల నీటిని జిల్లాలకు తరలిస్తున్నారు. గత వానాకాలం సీజన్‌లో ఎగువన సరిగా వర్షాలు కురవకపోవడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి నీరు చేరలేదు. ఫలితంగా పాలేరు జలాశయం సైతం నిండలేదు. ఈ నేపథ్యాన జలవనరుల శాఖ ఉన్నతాధికారులు పలుమార్లు పరిశీలించి పంటలకు కాకుండా తాగునీటి అవసరాలకే వినియోగించాలని సూచించారు.

రోజురోజుకూ దిగువకు..

పాలేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 23 అడుగులు కాగా మంగళవారం నాటికి 13.20 అడుగుల మేర నీరుంది. అదే టీఎంసీల్లో చూస్తే2.558కి గాను 1.125 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇంకా ఎనిమిది అడుగులు కిందకు వెళ్తే రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరుతుంది. వర్షాభావ పరిస్థితులతో సాగర్ నుంచి నీటి విడుదల లేకపోవడం, పాలేరు పరీవాహకంలోనూ చినుకు కురవక.. రోజువారీ సరఫరాకు తోడు ఎండల కారణంగా రిజర్వాయర్ నానాటికీ అడుగంటుతోంది. ప్రధానంగా ఖమ్మం నగరానికి పదిహేను రోజులకు ఒకసారి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలి. ఖమ్మం జిల్లా, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు కలిపితే ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు వచ్చే నెల 15వ తేదీ వరకు సరిపోతాయి. ఈలోపు తాగునీటి కోసమైనా సాగర్ నుంచి నీరు విడుదల చేయకపోతే ఈ ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పవు. మూడు జిల్లాల్లోని గ్రామాలకు జూలై వరకు నీరు అందించడానికి సుమారు 3.50 టీఎంసీలు అవసరముండగా, ఇందులో మార్చిలో సగం, ఏప్రిల్‌లో సగం ఇచ్చినా ఆటంకాలు ఉండవు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా సాగర్ నుంచి నెలకు ఒక టీఎంసీ చొప్పున విడుదల చేయడంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పంటలు ఎండుతున్నాయని..

పాలేరు పాత కాల్వ పరిధిలో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో బోర్లు, బావులు, చెరువుల కింద వరి, ఇతర పంటలు సాగు చేశారు. తొలుత భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండగా ఇప్పుడు చెరువులు, బావులు, బోర్లు అడుగంటాయి. దీంతో రైతులు పాలేరు పాత కాల్వకు నీటిని విడుదల చేయాలని, తద్వారా చెరువులు నిండడంతో పాటు, బోర్లు, బావుల్లోకి నీరు వస్తుందని చెబుతూ ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం కూడా ధర్నాచేసి రైతు సంఘాల ఆధ్వర్యాన పాత కాల్వ గేట్లు ఎత్తారు. నీటి పారుదల శాఖ అధికారులు, పోలీసులు అప్రమత్తమై మళ్లీ గేట్లను కిందకు దించారు. పాలేరు పాత కాల్వ కింద కూసుమంచి మండలంలో 7,127 ఎకరాలకు గాను 5,600 ఎకరాల్లో, నేలకొండపల్లి మండలంలో 16,200 ఎకరాలకు 8,500 ఎకరాల్లో యాసంగి పంటలు సాగు చేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో ఈ పంటలు వడబడుతున్నాయి.

గణాంకాల్లో పాలేరు రిజర్వాయర్

పూర్తి స్థాయి నీటిమట్టం	23 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	13.20 అడుగులు
నీళ్లు అందిస్తున్న జిల్లాలు	ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్
మొత్తం గ్రామాలు	2,439
రోజువారీ నీటి సరఫరా	135.45 క్యూసెక్కులు
ప్రస్తుత నిల్వలు ఎప్పటివరకు	మార్చి 15 వరకు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

పాలేరు జలాశయం ద్వారా జూలై వరకు తాగునీరు అందించేందుకు 3.50 టీఎంసీలు అవసరమని రెండు రోజుల క్రితం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. అయితే ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులోని నీటి పంపిణీ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) పర్యవేక్షిస్తోంది. దీంతో జిల్లా అధికారులు పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం కేఆర్‌ఎంబీకి పంపిస్తే అక్కడి నుంచి అనుమతి వస్తేనే సాగర్ నుంచి పాలేరుకు నీరు విడుదలయ్యే అవకాశముంది. వచ్చే నెల 15లోపు నీరు విడుదల చేస్తేనే మూడు జిల్లాలకు తాగునీటి సరఫరా నిరాంటకంగా జరగనుంది.

వచ్చేనెల నుంచే 'జీరో' బిల్లు

- ఉచిత విద్యుత్‌పై ఉత్తర్వులు విడుదల
- తెల్ల రేషన్ కార్డుదారులకు 200 యూనిట్ల మేర ఉచితం
- జిల్లాలో 3.50 లక్షల మందికి లబ్ధి

గృహేతర ప్రయోజనాలకు వినియోగిస్తే చర్యలు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరాకు గాను రూపొందించిన గృహజ్యోతి పథకంపై మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈపథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రారంభించగా.. అధికారులు మార్గదర్శకాలను వెలువరించారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి నెలకు 200 యూనిట్లు వినియోగించే విద్యుత్ కనెక్షన్లకు ఉచిత విద్యుత్ వర్తించనుంది. మార్చి నెల (ఫిబ్రవరిలో వినియోగించిన విద్యుత్‌కు సంబంధించి) నుంచే అర్హులకు 'జీరో' బిల్లులు జారీ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

3.50లక్షల మందికి పైగానే లబ్ధి

వచ్చే నెల నుంచి గృహజ్యోతి పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించగా... ప్రజాపాలన సభల ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులకు వర్తింపజేయనున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం జిల్లాలో 3.50 లక్షల మందికి పైగానే ఉచిత విద్యుత్ అందనుంది. జిల్లాలో గృహ విద్యుత్ కనెక్షన్లు 4,27,171 ఉండగా.. ఇందులో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న కనెక్షన్లు 3,85,222 ఉన్నట్లు గుర్తించారు. ఇందులో భాగంగా ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా సర్వే చేసిన అధికారులు 3,55,905 మంది నుంచి ఆధారాలను సేకరించారు. వీటిని ఎన్పీడీసీఎల్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయగా, అర్హులకు మార్చిలో జీరో బిల్లు అందనుంది. అయితే, అద్దె ఇళ్లలో ఉంటున్న వారు కూడా దరఖాస్తు చేసుకున్నప్పటికీ యజమాని పేరుతోనే జీరో బిల్లు వస్తుందని చెబుతున్నారు.

గృహజ్యోతి పథకం కింద అందే ఉచిత విద్యుత్‌ను గృహేతర ప్రయోజనాలకు వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో వెల్లడించింది. పథకంలో అర్హులైన వినియోగదారులు నిబంధనలను ఉల్లంఘిస్తే విద్యుత్ చట్టం–2003 ద్వారా తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



గృహజ్యోతి 'జీరో' బిల్లు నమూనా

పోర్టల్ ఆధారంగా అర్హులకు అమలు



ఎన్పీడీసీఎల్ పోర్టల్ ఆధారంగా గృహజ్యోతి పథకం అమలవుతుంది. మార్చి నెల నుంచే అర్హులకు జీరో బిల్లు అందుతుంది. పోర్టల్‌లో గుర్తించిన వారికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులను గుర్తిస్తాం. – ఏ.సురేందర్, ఎస్‌ఈ, ఖమ్మం సర్కిల్

మూడోసారీ ప్రభుత్వం మాదే..



కూసుమంచి సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పాండే, పక్కన నాయకులు

- కాంగ్రెస్ గెలవదు.. బీఆర్‌ఎస్ గెలిచినా దండగే
- బీజేపీ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే

ఖమ్మం మయూరిసెంటర్/కూసుమంచి/ఖమ్మం మామిళ్లగూడెం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అందించిన నీతివంతమైన పాలనతో రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజలు బీజేపీని 400 స్థానాల్లో గెలిపించనున్నారని కేంద్ర భారీ పరిశ్రమల శాఖమంత్రి మహేంద్రనాథ్ పాండే తెలిపారు. బీజేపీ ఆధ్వర్యాన చేపట్టిన విజయ సంకల్ప యాత్ర మంగళవారం బోనకల్, మధిర, ఖమ్మం నగరంతో పాటు కూసుమంచిలో కొనసాగగా.. పలుచోట్ల సభల్లో కేంద్ర మంత్రి మాట్లాడారు. తెలంగాణలో విజయ సంకల్ప యాత్ర అద్భుతంగా జరుగుతోందన్నారు. ప్రతీచోట ప్రజలు అపూర్వ ఆదరణ కనబరుస్తున్నారని చెప్పారు. ప్రధాని మోదీ పదేళ్లలో దేశాన్ని పటిష్టంగా తీర్చిదిద్దారని తెలిపారు. కాంగ్రెస్ అవినీతి, అసమర్థ పాలనతో విసిగిపోయిన ప్రజలు మొదటిసారి బీజేపీకి అవకాశం ఇవ్వగా, మోదీ నేతృత్వాన పాలనతో రెండోసారి 303 సీట్లు ఇచ్చారని వెల్లడించారు. మూడోసారి కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు 40 కూడా కష్టమే..

త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చి నరేంద్ర మోదీని మరోమారు ప్రధానిగా చేయాలని మహేంద్రనాథ్ కోరారు. తెలంగాణను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీజేపీకి ఓటు వేయకున్నా వందల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం, పలు రైల్వేస్టేషన్లను ఆధునీకరించామని తెలిపారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం ఆలయ అభివృద్ధికి ప్రధాని రూ.90 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 40 పార్లమెంట్ సీట్లు కూడా వచ్చే అవకాశం లేదని ఆయన పేర్కొన్నారు. అంతేకాక బీఆర్‌ఎస్‌ను గెలిపించినా ఫలితం ఉండదని తెలిపారు. కాగా, కేంద్రమంత్రిని ఖమ్మంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈసమావేశాల్లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు గెంటేల విద్యాసాగర్, దేవకి వాసుదేవరావు, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, ఉప్పల శారద, జ్వాల నర్సింహారావు, నంబూరి రామలింగేశ్వరరావు, ఈవీ.రమేష్, నున్నా రవికుమార్, శ్యాం రాథోడ్, శ్రీదేవి, తాండ్ర వినోద్‌రావు, అల్లిక అంజయ్య, దీకొండ శ్యాం, బజ్జూరి మల్లారెడ్డి, విజయారెడ్డి, మేక సంతోష్‌రెడ్డి, ఉపేందర్, శ్రీనివాస్‌రెడ్డి, గద్దం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాగా, కూసుమంచిలో సభ ముగిశాక కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే అక్కడ దివ్యాంగుడైన నలగాటి ఆగయ్యను గమనించారు. ఆయన పరిస్థితి తెలుసుకుని రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఉద్యోగులు



సీసీ కెమెరా ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష జరగనుండగా, 70 కేంద్రాల్లో 18,481మంది విద్యార్థులు రాయనున్నారు. ఈమేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్ష ఉదయం 9నుంచి 12గంటల వరకు నిర్వహించనుండగా 8గంటల నుంచే విద్యార్థులను అనుమతిస్తారు. ఇక 9గంటల దాటాక నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని ఇప్పటికే వెల్లడించారు. కాగా, మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు పలు కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లపై ఉద్యోగులకు సూచనలు చేశారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకుని ప్రశాంతంగా పరీక్ష రాయాలని డీఐఈఓ సూచించారు.

డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి చేయాలి

ఖమ్మం అర్బన్: జిల్లాలోని ఖమ్మం అర్బన్ మండలంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే (పంట నమోదు)ను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల సూచించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన సర్వేను మంగళవారం ఆమె పరిశీలించి ఏఓలు, ఏఈఓలకు సూచనలు చేశారు. నిర్దేశించిన విధంగా వరి, పెసర, మామిడి, జామ, ఆయిల్‌పామ్ వంటి వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు జామాయిల్ తదితర పంటల వివరాలూ నమోదు చేయాలన్నారు. ఖమ్మం ఏడీఏ ఏ.శ్రీనివాసరావు, ఏఓ బి.కిషోర్‌బాబు, ఏఈఓ సాయి శిరణ్మయి పాల్గొన్నారు.



మామిడి తోటలో పరిశీలిస్తున్న డీఏఓ, అధికారులు

విధులు సమర్థవంతంగా నిర్వర్తించండి

- ఎన్నికల్లో నోడల్ అధికారులే కీలకం
- లోక్‌సభ ఎన్నికలపై సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికలకు నోడల్ అధికారులుగా నియమితులైన వారు విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల సన్నద్ధతపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులు కీలకమైనవని, ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా పనిచేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఉద్యోగులను గుర్తించి శిక్షణ ఇవ్వాలని, ఎన్నికలకు కావాల్సిన సామగ్రి సమకూర్చుకోవాలని సూచించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఇప్పటినుంచే దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ నమోదైన కేంద్రాల్లో ఈసారి శాతం పెరిగేలా వ్యవహరించాలని చెప్పారు. ఈసమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్‌తో పాటు అధికారులు పలువురు పాల్గొన్నారు.



మిర్చి ధరలపై రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఉద్యోగులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సెస్సీ పరీక్షలకు హాజరయ్యే 16,577 మంది విద్యార్థుల కోసం 97 కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలన్నారు. విధులు నిర్వర్తించే వాటర్ బాయ్ మొదలు చీఫ్ సూపరింటెండెంట్ వరకు గుర్తింపు కార్డులు ధరించాలని ఆదేశించారు. ఉదయం 9–30 నుండి మధ్యాహ్నం 12–30 గంటల వరకు పరీక్షలు జరగనుండగా, 9–35 తర్వాత ఎవరినీ అనుమతించొద్దని తెలిపారు. డీఈఓ విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ధనా, ఎంఈఓలు శ్రీనివాస్, రాములు, హెచ్‌ఎంలు వీరస్వామి, నారాయణ పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీ పూర్తి

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లాకు కేటాయించిన అదనపు ఈవీఎంల మొదటి దశ తనిఖీ పూర్తయిందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంలో చేపట్టిన తనిఖీని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈవీఎంల తనిఖీని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షాన పూర్తి చేశామన్నారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, ఉద్యోగులు రాంబాబు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి కొనుగోళ్లలో దగా చేస్తే చర్యలు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి కొనుగోళ్లలో రైతులను దగా చేయాలని చూస్తే సహించేది లేదని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ హెచ్చరించారు. ఖమ్మం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జెండాపాట రూ. 21,400గా నిర్ణయమై న నేపథ్యాన రైతులతో మాట్లాడి ఎంత ధర నిర్ణయించారని ఆరాతీశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ పంట నాణ్యతగా ఉన్నా ఆశించిన ధర పెట్టలేదని తెలిపారు. దీంతో స్పందించిన కలెక్టర్ రైతులు నష్టపోకుండా పర్యవేక్షించాలని ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు. అలాగే, వ్యాపారులు సాకులతో ధర తగ్గిస్తే లైసెన్సు రద్దు చేస్తామని తెలిపారు. డీఏఓ ఎం.విజయనిర్మల, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ.అలీం, జిల్లా సూక్ష్మ సేద్యం పీడీ రమణ, ఏఈఓ శిరణ్మయి పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి రుణాల రికవరీ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నుంచి రుణాలు తీసుకున్న వారి నుంచి నిబంధనలకు లోబడి రికవరీ చేయాలని చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు సూచించారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రుణాల రికవరీ బాధ్యత బ్రాంచ్ మేనేజర్లపై ఉంటుందని తెలిపారు. రుణాల రికవరీ విషయంలో కొందరు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరు వినియోగిస్తున్నారని తెలిసిందన్నారు. అయితే, నకిలీ పత్రాలు సమర్పించి రుణాలు పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచిస్తే, దీన్ని కొందరు వక్రీకరిస్తున్నారని పేర్కొన్నారు. బ్యాంకు నిబంధనల మేరకు రికవరీ చేయాలే తప్ప ప్రభుత్వ పెద్దల పేర్లు దుర్వినియోగం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే, సన్న, చిన్నకారు రైతుల నుంచి రుణాల వసూళ్లలో ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. అనంతరం సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ మాట్లాడుతూ రుణాల వసూళ్లు సజావుగా సాగేలా మేనేజర్లు పర్యవేక్షించాలని తెలిపారు.

క్లుప్తంగా

'జాయిన్ ఎన్‌ఎస్‌యూఐ' లోగో ఆవిష్కరణ

ఖమ్మంవన్‌టౌన్: ఎన్‌ఎస్‌యూఐలో చేరేలా యువతను ప్రోత్సహించేందుకు రూపొందించిన లోగోను మంగళవారం ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ మాట్లాడుతూ ఓ పాఠశాల పక్కన దుకాణంలో సిగరెట్, మద్యం అమ్ముతున్నారని కలెక్టర్ ఫిర్యాదు చేస్తే కేఎంసీ సిబ్బంది తొలగించకుండా బీఆర్‌ఎస్ కార్పొరేటర్ అడ్డుకున్నాడని ఆరోపించారు. అనంతరం ఎన్‌ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా ఆకాష్‌నాయుడు, నగర అధ్యక్షుడిగా పేరం యశ్వంత్‌వర్ధన్, జిల్లా కోఆర్డినేటర్‌గా నితిన్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ లకావత్ సైదులు, నాయకులు ఆదర్శ్ నాయుడు, శీలం శ్రీనివాస్ ఈశ్వర్, ఫారూక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఇంటెలిజెన్స్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న ఘటనపై 'సాక్షి'లో 'ప్రభుత్వ భూమి హాంఫట్' శీర్షికన మంగళవారం కథనం ప్రచురితం కాగా, ఇంటెలిజెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి, దీని వెనక ఎవరున్నారనే అంశంపై ఆరా తీస్తున్న వారు త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది. ప్రభుత్వం కూడా ఆక్రమణల విషయంలో కఠినంగా ఉండడంతో అక్రమార్కులు, వారికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం.

పాముకాటుతో వ్యక్తి మృతి


విజయ్‌కుమార్ (ఫైల్)

తల్లాడ: మండలంలోని వెంగన్నపేటలో పాము కాటుకు గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామానికి చెందిన కొనకంచి విజయ్‌కుమార్(యాకోబు)(51) ఈనెల 7న ఇంటి వద్ద గేదెకు మేత వేద్దామని వాము నుంచి గడ్డి తీస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఆయనకు కల్లూరు, ఖమ్మం చికిత్స చేయించాక హైదరాబాద్ తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం రాత్రి మరణించాడు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కామేపల్లి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామేపల్లి మండలంలోని పండితాపురానికి చెందిన ధరావత్ ప్రేమ్(31) రెండేళ్ల పాటు భూమి కౌలుకు తీసుకుని తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం చేశాడు. అయితే, ఆశించిన దిగుబడి రాక అప్పులు తీర్చలేకపోయారు. దీంతో ఈ ఏడాది కూలీ పనులకు వెళ్తుండగా, అప్పుల కారణంగా కుటుంబంలో గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన ప్రేమ్ ఇంట్లో ఎవరూ లేని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్యతో పాటు ఓ కుమారుడు ఉన్నారు.

నా అంతిమ యాత్రలో డీజే పెట్టండి...

- పురుగుల మందు తాగి కుటుంబాన్ని కోరిన వ్యక్తి

ఖమ్మంక్రైం: జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి తన అంతిమయాత్రలో డీజే పెట్టాలని కుటుంబీలను కోరగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రఘునాథపాలెం మండలం రేగులచెలకకు చెందిన జిల్లేపల్లి కొండయ్య(38) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 21న కూడా పని వెళ్తున్నానని చెప్పి ఖమ్మం వచ్చాడు. ఆతర్వాత మద్యం తాగి అదే మత్తులో పురుగుల మందు తాగాడు. అనంతరం కుటుంబీకులకు ఫోన్ చేసిన కొండయ్య జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నానని చెబుతూ తన అంతిమ యాత్రకు డీజే పెట్టాలని కోరాడు. దీంతో వారు ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో పడి ఉన్న ఆయనను గుర్తించి ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్యాపిల్లలు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో గంజాయి స్వాధీనం

వైరా: భద్రాచలం నుండి హైదరాబాద్‌కు మంగళవారం రాత్రి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఎక్సైజ్ అధికారులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం డిపోకు చెందిన బస్సులో సుమారు ఐదు కేజీల గంజాయి తీసుకెళ్తున్నారన్న సమాచారంతో సీఐ మమతారెడ్డి ఆధ్వర్యాన తనిఖీ చేపట్టారు. బస్సు చివరి సీటులోని బ్యాగ్‌లో గంజాయి లభించగా, ప్రయాణికులెవరూతమది కాదని సమాధానం చెప్పారు. గంజాయిని స్వాధీనం చేసుకుని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,595

పూడిక.. తీయక..

తాలిపేరులో భారీగా పేరుకుపోయిన సిల్ట్

- మూడు దశాబ్దాలుగా పట్టించుకోని అధికారులు
- తగ్గిపోతున్న ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం
- సీతమ్మసాగర్‌తో ముడిపడిన పూడిక పనులు


తాలిపేరు ప్రాజెక్టులో భారీగా పేరుకు పోయిన పూడిక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో కీలకమైనదైన తాలిపేరులో పూడిక పేరుకుపోయింది. దశాబ్దాలుగా నామ్ కే వాస్తేగా నిర్వహణ చేపడుతుండడంతో ఈ పరిస్థితి తలెత్తింది. 70వ దశకంలోనే అప్పటి అవసరాలతో పాటు దూర దృష్టితో చూసిన ప్రభుత్వం.. తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. చర్ల మండల పరిధిలో 1976లో ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. నిధుల కొరత, స్థానికంగా నెలకొన్న అననుకూలత కారణంగా కింద, పైనా పడుతూ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి నీళ్లు నింపేందుకు పదేళ్లు పట్టింది. 1986 నుంచి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కుడి, ఎడమ కాల్వల ద్వారా చర్ల, దుమ్ముగూడెం మండలాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 24 వేల ఎకరాలకు నీరు అందిస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం కేవలం అర టీఎంసీనే కావడంతో రబీ సీజన్ వచ్చే సరికి కేవలం ఎనిమిది వేల ఎకరాల ఆయకట్టుకే నీరు ఇవ్వగలుగుతున్నారు. దీని కోసం ఆయకట్టును మూడు జోన్లుగా విభజించి వంతుల వారీగా సాగునీరు అందిస్తున్నారు.

గేట్ల మరమ్మతులతోనే సరి..

నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉన్నందున గరిష్ట స్థాయిలో ప్రయోజనం పొందాలంటే ప్రాజెక్టులో చేరిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉండగా, ఇప్పటివరకు ఆ దిశగా ప్రయత్నమే జరుగలేదు. గేట్ల మరమ్మతుల వంటి ప్రాథమిక పనులు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి వాటికే పరిమితమయ్యారు తప్ప పేరుకుపోయిన సిల్ట్‌ను పట్టించుకోలేదు. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ కింద చెరువుల్లో పూడికకే ప్రాధాన్యత ఇచ్చింది. దీంతో తాలిపేరులో పూడికతీత సాధ్యం కాలేదు. ఫలితంగా తాలిపేరు ప్రాజెక్టు అంతటా భారీ ఎత్తున సిల్ట్ పేరుకుపోయింది. ఇలా నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో కాల్వల చివరి ఆయకట్టుకు ఆశించినంతగా నీరు అందడం లేదు.

రెండేళ్లుగా నిలిచిన పనులు..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత బహుళార్ధ సాధక ప్రాజెక్టుగా దుమ్ముగూడెం – అశ్వాపురం మండలాల మధ్య గోదావరి నదిపై సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇక్కడ 36 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో బ్యారేజీ ఎగువన ఇటు అశ్వాపురం, మణుగూరు, అటు దుమ్ముగూడెం, చర్ల మండలాల పరిధిలో గోదావరి నదికి ఇరువైపులా సుమారు 30 కి.మీ. పొడవుతో కరకట్టలు నిర్మించాలని నిర్ణయించారు. ఈ కరకట్టలకు భారీగా మట్టి అవసరం ఏర్పడింది. దీంతో సీతారామా ప్రాజెక్టుకు మంజూరైన నిధులతో తాలిపేరు ప్రాజెక్టులో పూడికను తీసి, ఆ మట్టిని కరకట్ట నిర్మాణానికి ఉపయోగించాలని నిర్ణయించారు. పూడికతీత పనులు గతేడాది రబీ సీజన్‌లో మొదలు కావాల్సి ఉంది. అయితే తాలిపేరు పరిధిలోని రబీ సీజన్ ఆయకట్టు రైతులు ఇందుకు అభ్యంతరం తెలిపారు. దీంతో పనులు వాయిదా పడ్డాయి. ఆ వెంటనే పర్యావరణ అనుమతులు లేవనే కారణంతో సీతమ్మసాగర్ నిర్మాణ పనులపై గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో 2023 మే చివరి వారం నుంచి సీతమ్మసాగర్ పనులు కూడా ఆగిపోయాయి. ఇదే వరుసలో కరకట్ట నిర్మాణ పనులు, దానిపై ఆధారపడ్డ తాలిపేరు పూడిక పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా సీతమ్మసాగర్‌తో ముడిపెట్టకుండా తాలిపేరు ప్రాజెక్టు పూడికతీత పనులపై దృష్టి సారించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు


ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మీనా, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి ప్రశాంతంగా హాజరు కావాలని దంత వైద్యురాలు మురారి మీనా సూచించారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన మంగళవారం పదో తరగతి విద్యార్థులకు మంగళవారంలోని ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశ్నపత్రాలను ఆవిష్కరించిన మీనా మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. శ్రద్ధగా చదువుకుని ఒత్తిడిని అధిగమిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, తుడుం ప్రవీణ్ మాట్లాడగా జిల్లా స్థాయిలో టాపర్లుగా నిలిచిన పది మందికి బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. నాయకులు రంజాన్, సంక్రాంతి రవి, పర్వీన్, ప్రేమ్‌కుమార్, రాజు, వెంకటేష్, సాయిశేషు, సంగీత, వీరేందర్, వెంకటలక్ష్మి, శరణ్య, నాగరాజు, వినోద్, స్వాతి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశాల మేరకు నడుచుకుంటా..

డిప్యూటీ సీఎం భట్టి సతీమణి నందిని


భద్రాచల దేవస్థానంలో మల్లు నందిని, తదితరులు

భద్రాచలం: కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు నడుచుకుంటానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని తెలిపారు. భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి మంగళవారం వచ్చిన ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఆతర్వాత నందిని విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ తరఫున ఖమ్మం ఎంపీగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేశానని తెలిపారు. అయితే, పార్టీ ఆదేశాలను శిరస్సావహిస్తానని, పెద్దలు ఆదేశిస్తే పోటీలో ఉంటానని పేర్కొన్నారు. భద్రాచలం రామాలయం అభివృద్ధిని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోగా.. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి జరిగి తీరుతుందని చెప్పారు. తొలుత ఆమెకు ఆలయ అర్చకులు, ఈఓ రమాదేవి స్వాగతం పలికి స్వామి దర్శనం అనంతరం వేదాశీర్వచనం, ప్రసాదాలు అందచేశారు.

రికార్డులు లేకుండా సర్వేకు వచ్చిన అధికారులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడులో పోడు భూముల సర్వేకు వచ్చిన అటవీ, రెవెన్యూ అధికారులు 1బీ రికార్డ్ లేకుండా రావడంపై కాంగ్రెస్ నాయకుడు మద్దిశెట్టి సామ్యేలు, తదితరులు మండిపడ్డారు. ఈసందర్భంగా సామ్యేలు మాట్లాడుతూ 360 నుంచి 361 వరకు, 343 నుంచి 359 వరకు సర్వేనంబర్లలోని భూములు 1993 నుంచి 2010 వరకు గట్టు పోరంబోకుగా ఉన్నాయని తెలిపారు. ఆతర్వాత అటవీ శాఖ భూమిగా మారినట్లు రెవెన్యూ శాఖ వెల్లడించిందని చెప్పారు. ఈమేరకు సర్వే చేయాలని కోరితే అధికారులు సరైన రికార్డులు లేకుండా వచ్చారని తెలిపారు. ఈభూముల్లో గిరిజనులు పోడు సాగు చేస్తుండగా, పలువురు చేరుకుని సర్వే చేయాల్సిందేనని బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. త్వరలోనే సర్వే చేస్తామని రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు నచ్చజెప్పడంతో వారు వెళ్లిపోయారు. కాగా, అధికారుల తీరుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే రాగమయికి ఫిర్యాదు చేయనున్నట్లు సామ్యేలు తెలిపారు.

ఆర్మీ జవాన్‌కు ఘన నివాళి

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు


శ్రీనివాస్ కుటుంబీకులకు యూనిఫాం అందజేస్తున్న ఆర్మీ ఉద్యోగులు

కొణిజర్ల: రెండు రోజుల క్రితం వరంగల్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్మీ జవాన్ చల్లా శ్రీనివాస్ అంత్యక్రియలను కొణిజర్ల మండలం అన్నవరంలో మంగళవారం నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బాపనకుంట్లకు చెందిన చల్లా వెంకటేశ్వర్లు, సీతమ్మ దంపతుల మూడో కుమారుడు శ్రీనివాస్ 2009లో ఆర్మీలో చేరగా, అమ్మమ్మ ఊరైన అన్నవరంలో కుటుంబంతో సహా స్థిరపడ్డాడు. ఇటీవల సెలవుపై ఇంటికి వచ్చిన శ్రీనివాస్ భార్య భవానీతో కలిసి వరంగల్ జిల్లాలో బంధువుల ఇంటికి వెళ్లి వచ్చే క్రమాన ఆదివారం జరిగిన ప్రమాదంలో ఆయన మృతిచెందాడు. ఈమేరకు మృతదేహాన్ని సోమవారం సాయంత్రం అన్నవరం తీసుకురాగా, మంగళవారం ఉదయం ఆర్మీ ఉద్యోగులు ఆయన మృతదేహంపై జాతీయ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. ఆతర్వాత ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, ఆర్మీ ఉద్యోగులతో పాటు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పలువురు శ్రీనివాస్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

నంబర్ ప్లేట్ లేని 44 వాహనాలు సీజ్

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 44 వాహనాలను సీజ్ చేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని పలు కూడళ్లలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టగా, నంబర్ లేని వాహనాలతో పాటు రిజిస్ట్రేషన్ చేయించని వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే, నంబర్లను ట్యాంపరింగ్ చేసిన వారి వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొందరు నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతూ చలానాల నుండి తప్పించుకునేందుకు నంబర్లు కనిపించకుండా స్టిక్కర్లు వేస్తున్నారని తెలిపారు. ఈనెలలో ఇప్పటివరకు 203 మంది వాహనదారులకు జరిమానా విధించగా, తీరు మార్చుకోకపోతే కేసులు నమోదు చేస్తున్నామని ఏసీపీ వెల్లడించారు.

సమయానికి రావడం లేదని హెచ్‌ఎం అడ్డగింత


గేటు వద్ద హెచ్‌ఎంను అడ్డుకున్న గ్రామస్తులు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సరోజిని తరచూ పాఠశాలకు ఆలస్యంగా వస్తున్నారంటూ బీజేపీ నాయకుడు ఆపతి వెంకటరామారావు ఆధ్వర్యాన స్థానికులు మంగళవారం అడ్డుకున్నారు. హెచ్‌ఎం ఉదయం 9:30గంటలకు బదులు 10–30, 11 గంటలకు వస్తున్నారని, తద్వారా పిల్లల చదువులు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ఈమేరకు మంగళవారం కూడా ఆలస్యంగా రావడంతో గేటు వేసి ఆమెను అర గంట పాటు అడ్డుకున్నారు. అయితే, ఈ రోజే ఆలస్యమైందని, ఇకనుంచి సమయానికి వస్తానని హెచ్‌ఎం నచ్చచెప్పడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

రైలుకింద పడి ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మధిర: ఇప్పటికే పెళ్లయిన మహిళ ఇంకో వ్యక్తితో చనువుగా ఉంటుండగా.. కుటుంబంలో ఏర్పడిన కలహాలతో జంట ఆత్మహత్యకు యత్నించింది. మధిర–తొండల గోపవరం రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. చింతకానికి చెందిన శ్రీలక్ష్మిని ఐదేళ్ల క్రితం ఎర్రుపాలెం మండలం మామునూరుకు చెందిన శివయ్యకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అదే గ్రామానికి చెందిన సమీప బంధువు గంతాల సాయికృష్ణతో శ్రీలక్ష్మి కొంతకాలంగా ఫోన్‌లో మాట్లాడుతుంటే కుటుంబ సభ్యులు వారించారు. దీంతో ఆమె చింతకాని నుంచి ఎర్రుపాలెం వచ్చేసి తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. ఈనేపథ్యాన శ్రీలక్ష్మి, సాయికృష్ణ మంగళవారం బయటకు వచ్చి దెందుకూరు వద్ద ట్రాక్‌పై రైలు కింద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన వీరిని గమనించిన గ్యాంగ్‌మాన్ ఇచ్చిన సమాచారంతో జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి 108 అంబులెన్స్ వాహనంలో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి, ఆపై ఖమ్మం తరలించారు.

బీమా, గ్యాస్‌బుక్ పేరిట వసూళ్లు

ఏన్కూరు: మండలంలోని రాజలింగాలలో గ్యాస్ వినియోగదారులు మంగళవారం ఆందోళనకు దిగారు. వైరాలోని ఓ గ్యాస్ కంపెనీ నుంచి వచ్చామంటూ ఇద్దరు వ్యక్తులు రెండు రోజులుగా గ్రామంలో తిరుగుతున్నారు. బీమా చేయిస్తామని, కొత్త పుస్తకం ఇస్తామంటూ పలువురి నుంచి రూ.300 చొప్పున వసూలు చేశారు. ఈ విషయమై అనుమానం వచ్చిన గ్రామస్తులు ఆరా తీయడంతో సదరు వ్యక్తులు ఏజెన్సీ నుంచి రాలేదని తేలింది. దీంతో మంగళవారం వారిని నిలదీయగా నగదు తిరిగి ఇచ్చేశారని తెలిసింది.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరి మృతి

మరో ఇద్దరికి తీవ్రగాయాలు


బోడ రమేష్ (ఫైల్)


ముజాకిర్ అలియాస్ సోహెల్ (ఫైల్)

తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారు బోడతండాకు చెందిన బోడ రమేష్(34) గ్రానైట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని మోటార్‌సైకిల్‌పై ఖమ్మం నుండి ఆయన ఇంటికి బయలుదేరాడు. తిరుమలాయపాలెం సమీపానికి రాగానే ఖమ్మం ఖానాపురం హవేలీ, బుర్హాన్‌పురానికి చెందిన డిగ్రీ విద్యార్థులు షేక్ ముజాకిర్(19) అలియాస్ సోహెల్, మహ్మద్ మహబూబ్‌పాషా, ఐతరాజు సాయితనూష్ తిరుమలాయపాలెంలో ఓ మిత్రుడి ఇంట్లో ఫంక్షన్ నుంచి వెళ్తున్నారు. ఈక్రమంలో స్కూటీపై వెళ్తున్న ఈ ముగ్గురు రమేష్ బైక్‌ను అతివేగంగా ఢీకొనగా, రమేష్, ముజాకిర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మహబూబ్‌పాషా, సాయితనూష్‌కు తీవ్ర గాయాలు కాగా, ఇన్‌చార్జీ సీఐ రాజీరెడ్డి, ఎస్‌ఐ గిరిధర్‌రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెద్దదిక్కును కోల్పోయిన రమేష్ కుటుంబం

బోడ రమేష్ ఖమ్మంలో గ్రానైట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ వారానికి ఒక్కసారి ఇంటికి వెళ్లివచ్చేవాడు. ఇందులో భాగంగా సోమవారం ఇంటికి బయలుదేరిన ఆయన గమ్యాన్ని చేరలేదు. రమేష్‌కు భార్య విజయ, ఇద్దరు పిల్లలు ఉండగా ఆయన కష్టంపైనే కుటుంబ జీవనం సాగుతోంది. ప్రమాదంలో ఆయన మృతి చెందగా, మృతదేహం వద్ద భార్య, పిల్లలు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఇక ఖమ్మంకు చెందిన ముజాకిర్ డిగ్రీ చదువుతూనే చికెన్‌షాపు నిర్వహణలో తండ్రి యాకూబ్‌కు తోడుగా ఉండేవాడు. ఆయనకు ముగ్గురు చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉండగా తండ్రి కంటిచూపు సమస్యతో బాధపడుతున్నాడు. ఈమేరకు ముజాకిర్ మృతితో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.

ఉద్యోగాల పేరిట రూ.2 కోట్లకు టోకరా

- నకిలీ అపాయింట్‌మెంట్లు, సర్వీస్ బుక్‌లు ఇచ్చిన నిందితులు
- డీఈఓ సహా పలువురు అధికారుల సంతకాలు ఫోర్జరీ
- ఐదుగురి ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు


గుగులోతు రమేష్‌కు ఇచ్చిన నకిలీ సర్వీస్‌బుక్


ప్రేమ్‌కుమార్ - శోభన దంపతులు

కారేపల్లి: నిరుద్యోగుల ఆశలే పెట్టుబడిగా మలుచుకున్న నిందితులు గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయ పోస్టులు, కోర్టుల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగానే కాక పాల్వంచ కేటీపీఎస్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.2 కోట్ల మేర దండుకున్నారు. కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా గ్రామంలో మంగళవారం వెలుగుచూసిన ఈ మోసం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోలంపల్లికి చెందిన బానోతు తులసీరాం కుమార్తెలు శ్రీలేఖ, భూమికకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని తులసీరాం భార్య సోదరుడైన భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన గుగులోతు ప్రేమ్‌కుమార్ – శోభన దంపతులు నమ్మబలికారు. దగ్గరి బంధువులే కావడంతో నమ్మిన వారు 2022 మార్చి 16వ తేదీన రూ.36వేలు, ఆ తర్వాత విడతల వారీగా మరో రూ.80లక్షలను ఫోన్‌పే, బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లించారు. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 10వ తేదీన ఉద్యోగాలు వచ్చాయని నకిలీ ఉత్తర్వులు అందజేశారు. ఆ వెంటనే ఉద్యోగాల్లో చేరేందుకు శ్రీలేఖ, భూమిక వెళ్తామని చెప్పగా.. ఆన్‌లైన్‌లో సమస్య ఉందంటూ రెండేళ్లుగా మభ్యపెడుతూ వచ్చాడు. ఆతర్వాత అనుమానంతో తులసీరాం విచారించగా నకిలీఅపాయింట్‌మెంట్ ఆర్డర్లుగా తేలడంతో నిలదీస్తే దిక్కున్నచోట చెప్పుకోండని బెదిరించారు. దీంతో తులసీరామ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలోనే సమీప బంధువులైన పోలంపల్లి గ్రామానికి చెందిన గుగులోతు రమేష్ నుంచి రూ.52లక్షలు, అజ్మీరా దివ్య నుంచి రూ.25లక్షలు, పేరుపల్లి గ్రామానికి చెందిన బానోతు రఘు నుంచి రూ.30లక్షలు కలిపి రూ.2కోట్లకు పైగా ప్రేమ్‌కుమార్ దంపతులు తీసుకున్నట్లు బయటపడగా, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు నిందితుడు ప్రేమ్‌కుమార్‌పై కేసు నమోదు చేసిన సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ ఎన్.రాజారామ్ దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో ప్రేమ్ భార్య పాత్రపై కూడా విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో ప్రేమ్‌కుమార్

ఉద్యోగాల పేరిట డబ్బు వసూలు చేయడమే కాక డీఈఓతో పాటు పలువురు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన నిందితుడు ప్రేమ్‌కుమార్‌ను కారేపల్లి పోలీసులు మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, డైరెక్టర్లు, డీఈఓ తదితరుల ఫోర్జరీ సంతకాలతో అపాయిమెంట్ ఆర్డర్లు తయారుచేసినట్లు గుర్తించారని తెలిసింది. అంతేకాక కొందరికి నకిలీ సర్వీసు బుక్కులు ఇచ్చిన విషయం వెలుగుచూసింది.